క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న తాహెన్‌బిన్ హందాన్, అన్వేష్‌రెడ్డి

జక్రాన్‌పల్లి: మండలంలోని మునిపల్లి మాజీ సర్పంచ్ చిన్న సాయారెడ్డి తండ్రి ముస్కు బొర్రన్న గుండెపోటుతో ఇటీవల మృతి చెందాడు. ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ సాయారెడ్డికి మృతుడు బొర్రన్న అన్న కావడంతో ఇరువురిని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట పార్టీ నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

రాజకీయ పార్టీల నేతలతో సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీవో మనోహర్‌రెడ్డి

సిరికొండ: మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికలపై రాజకీయ పార్టీల నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని సూచించారు. సమావేశంలో ఏఎంసీ డైరెక్టర్ రొక్కం సంపత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సాయారెడ్డి, గంగారెడ్డి, లస్కర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, దువ్వూరి సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శంతన్

సిరికొండ: విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో 20 శాతం నిధులు కేటాయించాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోతు శంతన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సభ్యత్వ నమోదులో భాగంగా మండలంలోని పెద్దవాల్గోట్, న్యావనంది, సిరికొండ జెడ్పీ పాఠశాల, కేజీబీవీ పాఠశాలల్లో ఆయన గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని ప్రాధాన్యత రంగంగా గుర్తించకపోవడం, బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించకపోవడంతోనే ప్రభుత్వ విద్య సంక్షోభంలోకి వెళ్తుతోందని అన్నారు. డీఎస్ కొటారి కమిషన్ పేర్కొన్నట్లు కేంద్రం జీడీపీలో ఆరు శాతం నిధులు, రాష్ట్రాలు 30 శాతం నిధులను కేటాయించాలనే సిఫారసులను తక్షణమే అమలు చేయాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో మూతబడిన 5 వేల పాఠశాలలను తెరిపించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు ఎం బాలయ్య, కె ఓమాజీ, పెంటన్న, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి సీఎండీకి ఆహ్వాన పత్రిక అందజేత

తెయూ(డిచ్‌పల్లి): తెయూలో ఈ నెల 21న నిర్వహించనున్న సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతికి హాజరు కావాలని కోరుతూ తెయూ బంజారా విద్యార్థి, ఔట్‌సోర్సింగ్ నాయకులు సింగరేణి సీఎండీ బలరాం నాయక్‌ను హైదరాబాద్‌లో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. తెయూ గిరిజన శక్తి విద్యార్థి సంఘం అధ్యక్షుడు శ్రీను రాథోడ్, నాయకులు శ్రీకాంత్, లక్ష్మణ్, రాము, పృధ్వీనాయక్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది బికోజీ, దిగంబర్ చౌహాన్, గులాబ్ తదితరులు ఉన్నారు.

సెల్‌ఫోన్ అందజేత

సిరికొండ: మండల కేంద్రానికి చెందిన అఖిల్‌కు పోయిన సెల్ ఫోన్‌ను ఎస్సై ఎల్ రామ్ గురువారం అందజేశారు. అఖిల్ గత నెల 30న ఫోన్ పోవడంతో పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ యాప్ ద్వారా పోలీసులు ఫోన్‌ను కనుగొని బాధితుడికి అందజేశారు. ఎస్సై వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

62 ఏళ్ల వయస్సులో పీజీ సీటు



రాంచందర్‌ను సన్మానిస్తున్న దయాకర్‌గౌడ్

నిజామాబాద్‌నాగారం: 62 ఏళ్ల వయస్సులో మెడిసిన్‌లో పీజీ సీటు సాధించిన ప్రముఖ పిల్లల వైద్యుడు నీలి రాంచందర్‌ను గురువారం రాష్ట్ర కాంగ్రెస్ లీగల్ సెల్ కన్వీనర్ దయాకర్‌గౌడ్, ప్రముఖ వైద్యుడు జలగం తిరుపతిరావు ఘనంగా సన్మానించారు. నిత్య విద్యార్థిగా కొనసాగుతున్న ఆయనను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్య క్రమంలో డాక్టర్ జమాల్‌పూర్ రాజశేఖర్, న్యాయవాది శ్యామ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తాం

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- కుల గణనపై ప్రతిపక్షాలవి పసలేని ఆరోపణలు



సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

సిరికొండ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి అన్నారు. సిరికొండ మండలంలోని న్యావనంది గ్రామంలో ఊర చెరువు కట్టపై రూ. కోటి నలభై లక్షల నిధులతో చేపట్టనున్న మినీ ట్యాంక్ బండ్ పనులను ఎమ్మెల్యే గురువారం పరిశీలించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు ఉత్తర్వుల మేరకు రిజర్వేషన్లలో ఏవైనా ఇబ్బందులు తలెత్తితే తమ పార్టీ ద్వారా బీసీలకు 42 శాతం టికెట్లు ఇస్తామని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణనపై ప్రతిపక్షాలు చేస్తున్నవి పసలేని ఆరోపణలు అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం చేసిందన్నారు. సుప్రీం కోర్టు నిబంధనల మేరకు ఎస్సీ వర్గీకరణను సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే అమలు చేశారని పేర్కొన్నారు.

గల్ఫ్ కార్మికుల స్థితిగతులపై సర్వే

గల్ఫ్ కార్మికుల స్థితిగతులపై అధ్యయనం కోసం రాష్ట్రంలో రెండు జిల్లాలు ఎంపికవ్వగా అందులో నిజామాబాద్ జిల్లా ఒకటని ఎమ్మెల్యే తెలిపారు. జిల్లాలో ఎక్కువగా గల్ఫ్ కార్మికులు ఉన్న నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని సిరికొండ మండలంలోని న్యావనంది, మైలారం, ధర్పల్లి మండలంలోని హోన్నాజిపేట్, దుబ్బాక గ్రామాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఆయా గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టు కింద ఎందుకు వలస వెళ్లాల్సి వస్తోంది.. వెళ్లిన వారు ఎలా ఉన్నారు తదితర అంశాలపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడం జరుగుతుందన్నారు. సమావేశంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్కోల్ భాస్కర్‌రెడ్డి, ఎర్రన్న, పార్టీ మండల అధ్యక్షుడు బాకారం రవి, నరేశ్, సొసైటీ చైర్మన్ గంగాధర్, ఏఎంసీ డైరెక్టర్లు ముత్తెన్న, సంపత్‌రెడ్డి, నరేందర్, జనార్దన్, బడాల మహిపాల్, ఆసిఫ్, దిగంబర్, మొట్టల రాము, రాంరెడ్డి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

‘చలో హైదరాబాద్’ను విజయవంతం చేయాలి



మోపాల్‌లో మాట్లాడుతున్న వేల్పూర్ భూమయ్య



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

మోపాల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అర్హులకు అందని ద్రాక్షలా మారాయని, వాటి అమలుకు ఈనెల 20న చేపట్టనున్న చలో హైదరాబాద్ ప్రదర్శన, బహిరంగసభను జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య కోరారు. గురువారం మోపాల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే షుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని చెప్పి సబ్ కమిటీ వేశారని, సబ్ కమిటీ ఈ ప్రాంతంలో ఫ్యాక్టరీలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినా అడుగు ముందుకు పడలేదన్నారు. సారంగాపూర్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపించి బెల్లం కేంద్రంగా మార్చి ప్రభుత్వమే నడిపించాలని డిమాండ్ చేశారు. సభను రైతులు, ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో అగ్గు ఎర్రన్న, చిన్నయ్య, కట్ట రజనీకాంత్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి

నిజామాబాద్ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు, పోడుభూములకు పట్టాలివ్వడం, చేయూత పథకాన్ని ప్రారంభించాలన్నారు. బహిరంగ సభను అన్నివర్గాల ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. అనంతరం సభ పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో నగర కమిటీ కార్యదర్శి నీలం సాయిబాబా, నాయకులు శివకుమార్ కుమార్, జి రమేశ్, నర్సింగ్‌రావు, శంకర్, రాజు పాల్గొన్నారు.

సంతాప సభను విజయవంతం చేయాలి



డిచ్‌పల్లిలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు



మోపాల్‌లో..

డిచ్‌పల్లి: సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు యాదగిరి సంతాప సభను విజయవంతం చేయాలని పార్టీ డిచ్‌పల్లి మండల కార్యదర్శి మురళి పిలుపునిచ్చారు. గురువారం డిచ్‌పల్లి మండల కేంద్రంలో సంతాప సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు సుదీర్ఘకాలం పార్టీ జిల్లా కార్యదర్శిగా యాదగిరి పని చేశారన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 17న జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో సంతాప సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు, విప్లవాభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు అశోక్, రాజేశ్వర్, సుమన్, విజయ్, సాయిలు, గంగాధర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మోపాల్‌లో ..

మోపాల్: నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో ఈ నెల 17న నిర్వహించే యాదగిరి సంతాప సభ గోడప్రతులను గురువారం మోపాల్ మండలంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి సాయాగౌడ్ మాట్లాడుతూ.. యాదగిరి రాష్ట్ర విప్లవ పార్టీలకు ఆదర్శప్రాయుడని కొనియాడారు. 1975 నుంచి 1978 కాలంలో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినా.. ప్రజల కోసం పని చేయాలనే ఉద్దేశంతో కమ్యూనిస్టు పార్టీల వైపు మొగ్గు చూపారన్నారు. నాయకులు నారాయణ, రాజు, చంద్రయ్య, అంబేద్కర్, గంగాధర్, లక్ష్మణ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల స్థితిగతులపై అధ్యయనం



మాట్లాడుతున్న నేషనల్ వర్కర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్‌పర్సన్ లిజి జోసెఫ్

సిరికొండ: గల్ఫ్ వలస కార్మికుల స్థితిగతులపై అధ్యయనం చేయడం కోసం పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే చేయనున్నట్లు నేషనల్ వర్కర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్‌పర్సన్ లిజి జోసెఫ్ తెలిపారు. పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన న్యావనంది గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంతర్జాతీయ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా పాలన యంత్రాంగం కలిసి ఎన్జీవోల సహకారంతో అన్ని ప్రభుత్వ శాఖలు తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్‌లతో కలిసి ఈ సర్వే కొనసాగుతుందన్నారు. వలస కార్మికులతోపాటు వ్యవసాయరంగం, రైతుల స్థితిగతులపై కూడా అధ్యయనం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం రెండేళ్లపాటు కొనసాగుతుందన్నారు. ఎమిగ్రేంట్స్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షుడు మంద భీంరెడ్డి మాట్లాడుతూ.. గల్ఫ్ కార్మికుల కోసం రాష్ట్ర ప్రభుత్వం గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గల్ఫ్ దేశాల్లో కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తగిన సహకారం అందించనున్నట్లు తెలిపారు.

మహిళ మెడలో నుంచి గొలుసు చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని వీక్లీ మార్కెట్ ప్రాంతంలో గల సన్ ఫ్లవర్ స్కూల్ సమీపంలో ఓ మహిళ మెడలో నుంచి దుండగులు బంగారు గొలుసును ఎత్తుకెళ్లారు. విజయ అనే మహిళ ఇంట్లో ఉండగా, గుర్తుతెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి ఆమె మెడలోని 3తులాల గొలుసును లాక్కెళ్లారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

యువకుడి అదృశ్యం

నిజామాబాద్ రూరల్: రూరల్ పీఎస్ పరిధిలోని చంద్రశేఖర్‌కాలనీకి చెందిన దీపక్ అనే యువకుడు అదృశ్యమైనట్లు రూరల్ ఎస్సై-2 ఆనంద్‌సాగర్ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రశేఖర్‌కాలనీకి చెందిన దీపక్ ఈ నెల 4న తన సెల్ నుంచి సిమ్ తీసుకొని ఇంటినుంచి వెళ్లి తిరిగి రాలేదన్నారు. కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

భీమా కోరేగావ్ కేసు కొట్టివేత

ఖలీల్‌వాడి: భీమా కోరేగావ్ అమరులకు నివాళిగా నిర్వహించిన ర్యాలీ కేసును నిజామాబాద్ మొదటి అదనపు జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్(జూనియర్ సివిల్ జడ్జి) ఖుష్బు ఉపాధ్యాయ్ గురువారం కొట్టివేశారు. మహారాష్ట్రలోని భీమా కోరేగావ్ అమరుల దినోత్సవం సందర్భంగా జనవరి1, 2018న నగరంలోని కొన్ని దళిత సంఘాలు ఆర్టీసీ బస్టాండ్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించాయి. ర్యాలీకి పోలీసుల అనుమతి లేదని, చట్ట నిబంధనలకు విరుద్ధంగా ర్యాలీ నిర్వహించారని, ర్యాలీని అడ్డుకోబోయిన పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు న్యాయ విచారణలో నేర నిరూపణ కాకపోవడంతో ప్రధాన ముద్దాయి చక్రే దౌలత్, దండి వెంకట్, రామారావు కాంబ్లే, సంజీవ్ ససనే, మధు కాంబ్లే, నవీన్ గాన్డే, సబ్బని లత ను నిర్దోషులుగా విడుదల చేస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

ప్రత్యామ్నాయ మార్గాలు వెతకాలి

తెయూ(డిచ్‌పల్లి): కోర్టుల్లో బాధితులకు తగిన న్యాయం జరిగేలా అవసరమైన ప్రత్యామ్నాయ మార్గాలు వెతకాలని ప్రముఖ న్యాయవాది ఆర్ రామాగౌడ్ సూచించారు. గురువారం తెయూ న్యాయ కళాశాలలో ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిసొల్యూషన్ అనే అంశంపై 5వ సెమిస్టర్ న్యాయ విద్యార్థులకు మౌఖిక పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు న్యాయవాది రామాగౌడ్ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా, లా విభాగం బీవోఎస్ చైర్మన్ బి స్రవంతి ఇంటర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. అధ్యాపకులు జెట్లింగ్ ఎల్లోసా, నాగజ్యోతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలి

మోపాల్: సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా సెలవుదినంగా ప్రకటించాలని బంజారా సంఘం నాయకుడు ఎల్ బాలు నాయక్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ నెల 15న సేవాలాల్ మహరాజ్ జయంతి నిర్వహిస్తామని తెలిపారు. దేశంలో 15 కోట్ల జనాభా కలిగి ఉన్న బంజారా, గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ వారి సమాజాభివృద్ధికి, చైతన్యానికి కృషి చేశారని కొనియాడారు. సేవాలాల్ మహరాజ్ గురించి పార్లమెంట్‌లో మాట్లాడిన ఎంపీ అర్వింద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 15న పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలకు సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

నియామకం



దేవరాజ్

నిజామాబాద్‌నాగారం: జిల్లా మాల మహానాడు జిల్లా యూత్ అధ్యక్షుడిగా మగ్గిడి దేవరాజ్‌ను నియమించినట్లు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీరడి లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు సక్కి విజయ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా దేవరాజ్ మాట్లాడుతూ.. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

సిరికొండ: మండలంలోని రావుట్ల గ్రామంలో ఉన్న గాడిమాకుల రాజరాజేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన వార్షిక ఉత్సవాల్లో ఎమ్మెల్యే భూపతిరెడ్డి గురువారం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని స్వామి వారిని వేడుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఉత్సవాల్లో డీసీసీ కార్యదర్శి గొల్ల ఎర్రన్న, గడ్కోల్ భాస్కర్‌రెడ్డి, బాకారం రవి, డీలర్ రమేశ్, ప్రసాద్, భాస్కర్, గంగారెడ్డి, నాని, దాసు, సామేల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సరోజిని నాయుడు జయంతి



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నిజామాబాద్ రూరల్: మండలంలోని గుండారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య సమరయోధురాలు, కవయిత్రి సరోజిని నాయుడు జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, పోస్టర్ తయారీ, కవితా పఠన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బి అమర్‌నాథ్, ఉపాధ్యాయులు గిరిధర్, ఆరోగ్యరాజ్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తలు సమష్టిగా పని చేయాలి

- ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్

సుభాష్‌నగర్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ, తపస్ బలపర్చిన అభ్యర్థి కొమరయ్య గెలుపునకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్ సూచించారు. గురువారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి అధ్యక్షతన టీచర్ ఎమ్మెల్సీకి సంబంధించి సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్, మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు ఆకుల విజయ హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభావిత ఓటర్లను గుర్తించి వారితో వ్యక్తిగతంగా పరిచయం చేసుకోవాలని, ప్రతి ఓటరును కలిసి అభ్యర్థి గురించి అవగాహన కల్పించాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలిస్తేనే భవిష్యత్‌లో రాష్ట్రంలో బలమైన స్థానం ఏర్పడుతుందన్నారు. సమావేశంలో నాయకులు డాక్టర్ కొండా ఆశన్న, మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఆడ, మగ ఇద్దరూ సమానమే



రాంపూర్‌లో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

- జిల్లా సంక్షేమ అధికారిణి రసూల్‌బీ

డిచ్‌పల్లి: సమాజంలో ఆడ, మగ పిల్లలు ఇద్దరూ సమానమేనని ఇద్దరికి సమాన హక్కులు ఉంటాయని జిల్లా సంక్షేమ అధికారిణి రసూల్‌బీ పేర్కొన్నారు. మహిళా శిశు దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం, జిల్లా బాలల సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం డిచ్‌పల్లి మండలం రాంపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిచ్‌పల్లి ప్రాజెక్టు నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన రసూల్ బీ మాట్లాడుతూ.. ‘ఎంపవరింగ్ ద గర్ల్స్ ఫర్ బ్రైట్ ఫ్యూచర్’ బేటీ బచావో బేటీ పడావో అనే ఐదు ఉద్దేశాలను తెలుపుతుందని వివరించారు. ముఖ్యంగా భ్రూణ హత్యలను అరికట్టి ఆడపిల్లల లింగ నిష్పత్తిని పెంచాలన్నారు. పిల్లలపై వివక్ష, అఘాయిత్యాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చిన్నతనంలోనే పెళ్లిళ్లు చేయడం నేరమన్నారు.

యునిసెఫ్ లెక్కల ప్రకారం 40 శాతం ఆడపిల్లలకు 18 ఏళ్ల లోపు పెళ్లి జరుగుతున్నాయన్నారు. అలాగే 12 శాతం ఆడపిల్లలకు 17 ఏళ్ల లోపు పెళ్లిలు జరుగుతున్నాయన్నారు. ప్రతి ఆడపిల్లకు క్వాలిటీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఉండాలని వ్యక్తిగత పరిశుభ్రత ఉండాలని ఇవన్నీ ఉంటే ఆడపిల్లలు తప్పకుండా విజయాన్ని సాధిస్తారని వివరించారు. అనంతరం విద్యార్థినులతో గ్రామంలోని ప్రధాన వీధుల్లో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో జ్యోతి, సూపర్‌వైజర్లు మమత, బుజ్జి, భాగ్యలక్ష్మి, హెచ్ఎం గోవర్ధన్, పోషణ్‌అభియాన్ కోఆర్డినేటర్ రంజిత్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న విక్రమ్‌గౌడ్

నిజామాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్యార్థులకు విడుదల చేయాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్ డిమాండ్ చేశారు. నగరంలోని కేర్ కళాశాలలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మెడికల్ సీట్ల కేటాయింపులో ‘బీ’ ‘సీ’ కేటగిరీల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ఫీజులు కట్టలేక ఒత్తిడితో చదువుకు దూరమయ్యే పరిస్థితి నెలకొంటోందని అన్నారు. ప్రభుత్వం బీసీ విద్యార్థులకు షరతులు లేని విద్యను అందించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్, బుస్స ఆంజనేయులు, కొయ్యాడ శంకర్, సంతోష్ కుమార్, బసవరాజు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	88,600	వెండి(కిలో)	99,500
22 క్యారెట్స్	81,592	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు


చికెన్	ధరలు	డ్రెస్స్‌డ్	180
	(కిలోకు)	లైవ్	140
స్కిన్‌లెస్	220	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	15	గాజరుగడ్డ	30	50
బెండకాయ	40	80	పచ్చిమిర్చి	40	60
జీరకాయ	40	80	దోసకాయ	30	50
దొండకాయ	30	50	ఆలుగడ్డ	20	40
బీర్నీసుకాయ	40	60	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	50	గోబిపువ్వు	20	40
వంకాయ	30	50	బీట్‌రూట్	30	50
పాలకూర	10	20	కరివేపాకు	60	100
మెంతికూర	15	30	చామగడ్డ	40	80
కొత్తిమీర	10	20	గోరుచిక్కుడు	40	80
పుదీనా	40	80	చిక్కుడుకాయ	30	60
క్యాప్సికం	40	60			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	చావా(హిందీ)- 11.00, 1.40, 10.20 తండేల్(తెలుగు)-4.35, 7.30
స్క్రీన్-2	లైలా(తెలుగు)-11.00,1.40,7.20, 10.20 చావా(హిందీ)-4.30
స్క్రీన్-3	బ్రహ్మ ఆనందం(తెలుగు)-11.00, 4.30 ఆరెంజ్(తెలుగు)- 1.40 కెప్టెన్ అమెరికా(తెలుగు)-4.30 తండేల్(తెలుగు)- 10.25

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	కెప్టెన్ అమెరికా(తెలుగు)-10.45, 7.20 లైలా(తెలుగు)-1.25 తండేల్(తెలుగు)-4.15, 10.00
స్క్రీన్-2	చావా(హిందీ)-10.00, 4.00, 10.25 కెప్టెన్ అమెరికా(3డీ తెలుగు)-1.20 తండేల్(తెలుగు)-7.25
స్క్రీన్-3	తండేల్(తెలుగు)-10.30 నిదురించు జహాపన(తెలుగు)-1.35 లైలా(తెలుగు)-4.10 చావా(హిందీ)-7.00 సనమ్ తేరి కసమ్(హిందీ)-10.20
స్క్రీన్-4	తల(తెలుగు)-10.55 సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)-1.35, 7.40 - బ్రహ్మ ఆనందం(తెలుగు)-4.35 లైలా(తెలుగు)-10.40
లలితామహల్	తండేల్(తెలుగు)
దేవి	లైలా (తెలుగు)
నటరాజ్	చావా(హిందీ)
విజయ్	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)